" దాతయైన వాడు దారిద్ర్యమున నున్న
మానడుపకరించు మార్గమతడు"
-కురాల్

# 3. ఇయర్పగై నాయనారు

దాతృత్వము విషయములో 'నేనిచ్చుటకు నాదగ్గరేమిలేదు' అన్న లేమిమాట ఉన్న తుల యెడ వినిపించదుఅని కురాల్ చెబుతుంది. అటువంటి మహనీయులలో ఒకరు ఇయర్పగైనాయనారు. దాతృత్వము ఆయన నరనరాల్లో జీర్ణించి పోయింది. శివభక్తుల ను తన ఇంటికి పిలిచి శ్రద్ధగా భక్తితో వారినర్చించి - వారు కోరినది తన దగ్గర ఉన్నది సంతోషముగా ఇచ్చెడివాడు. శివభక్తుడు అడిగినచో లేదనుమాట అతని నుండి వెలువ డదు. వారి సంతోషమే పరమశివుని అనుగ్రహ విశేషమని ఆప్రకారమునడచెడివాడు.

ఇయర్పగైనాయనారు కావేరీపూమ్ పట్టణము వాస్తవ్యుడు. వైశ్యకులజుడు. శివభ క్తులందరూ ఆయనకు శివస్వరూపులే.

ఈ భక్తుని విషయమై పరమశివునికి సంతృప్తికలిగింది. ప్రపంచానికి ఇయర్ పగైర్ విశిష్టత తెలుపాలనుకున్నాడు. అందుకని ఒక బ్రాహ్మణ వేషములో త్రిపుండ్రములతో శైవాచార్యుడుగ నాయనారు ఇంటి ఎదుట నిలిచాడు. నాయనారు ఆయనను చూచి పరమానందముతో స్వాగతము చెప్పి, లోనికి గొని పోయి "మహాత్ములు ఊరకరారు. మీరు వచ్చిన కారణము తెలుపగలరు !' అని నమ్రతతో బలికెను. బ్రాహ్మణుడు "అయ్యా నీవు వున్న పదార్ధములతో అడిగిన దానిని లేదనుకుండ ఇచ్చువాడవు. ఇది తెలిసికొని నిన్నొకటి కోరవచ్చితిని' అన్నాడు. నాయనారు విస్మయముతో 'సెలవిండు, తమరు ఏది కోరినను, నాదగ్గరున్నచో వెంటనే ఇచ్చెదను' "కోరుకొనుడు' అనెను. బ్రాహ్మణుడు "నీభా ర్యను కోరివచ్చితిని" అని పలికాడు.

పరమశివుని మహాభక్తుడు నాయనారు. నాయనారుకు వచ్చినతని కోరిక మంచిదో చెడుదో అన్న ఆలోచన, తలపు దరికి రానీయలేదు. శివభక్తుడు వచ్చాడు. అడిగాడు. అడిగిన ది తన దగ్గరున్నది ఇస్తానన్నాడు. అంతే భక్తుని కోరికను పాటించుటే తన కర్తవ్యము. 'ఇచ్చితిని' 'అనిమాటిచ్చి ఈ సంగతి నాయనారుభార్య కెరింగించాడు. ఆమె ముందఱ నిశ్చేష్టురాలైంది. వెంటనే తేరుకొని భర్త ఆజ్ఞను పాటించుటే పతివ్రతా ధర్మమని - ఆ బ్రాహ్మణుని వెంట వెళ్లుట కు అంగీకరించింది. నాయనారు బయటకు వచ్చి నా దానము పరిగ్రహించండి అని బ్రాహ్మ ణుని అడిగాడు. బ్రాహ్మణునకు భార్య తరపు బంధువులు తననేమైనా జేయుదురేమోనని భయపడి - మీ బంధువులు వూరుదాటువరకు అడ్డగించకుండ నీవుకూడ నా వెంటరావలె నని ఇయర్ పగైయారును కోరాడు. సరేనని బ్రాహ్మణుని కాపాడుటకు ఆయుధము వెంటబె ట్టుకుని ఆ బ్రాహ్మణుడు తోను భార్యతోను బయలుదేరాడు.

కొంత దూరము పోవుసరికి బంధువులు ఈ విషయమును విని కోపోద్రిక్తులై బ్రాహ్మణుని చంపుటకు బయలుదేరారు. వచ్చి ఎదిరించారు. బ్రాహ్మణుడు భయపడ్డాడు. నాయనారు

భార్య -“మీరు భయపడ వలదు - నాయనారు వారి నందటిని జయించును” అన్నది. బంధువులందఱు నాయనారుతో “నీవు చేస్తున్నది, బ్రాహ్మణుడు కోరినది మహా పాపము,అకృత్యము” అని వాదించారు. నాయనారు వినలేదు. అపకీర్తి, అపవాదులను భరించలేక ఆ బంధువులు “నీతో పోరాడుతాము, చావనైనా చస్తాముకాని ఈ అపకీర్తి అపవాదులను భరించలేము” అనిపోరుకు సిద్ధమయారు. ఒక గడియలో నాయనారు చేతిలో అందరు బంధువులు చని పోయారు. నాయనారు నిశ్చింతతో భార్యను ఆగంతుకుని వెంట తీసికొని బయలు దేరాడు.

కొంత దూరముపోగా తిరుచ్చైకాడు దేవాలయము వచ్చింది. బ్రాహ్మణుడు నాయనారును “ఇంటికి తిరిగి వెళ్లుము” అని ఆదేశించారు. నాయనారు బ్రాహ్మణునకు నమస్కరించి వెను దిరిగాడు.

ఇయర్ పగైయారు ఇంటిదెసగా కొంచెము దూరము వెళ్లాడోలేదో - బ్రాహ్మణుడు నాయనారును బిగ్గఱగా పిలిచాడు. ఇంకెవరైనా అడ్డగించారేమో నని తలచి నాయనారు బ్రాహ్మణుడుదగ్గరకు వెంటనే వెళ్లాడు. అక్కడ నాయనారుకు ఆశ్చర్యకరముగ బ్రాహ్మణుడుఅంతర్ధానమైనట్లనిపించింది. భార్య ఒక్కతే అక్కడ నిలుచుని వుంది. ఇంతలో పార్వతీపరమేశ్వరులు ఆకాశమున నగుపడి “మీ భక్తి తత్పరతకు ముగ్ధులమైనాము. భక్తులయెడ నీ సేవ అమోఘము. మీ ఇద్దరు కైలాసమునకు రండి” అని ఆహ్వానించారు. పార్వతీపరమేశ్వరులు అంతర్ధానమయ్యారు. నాయనారు తన భార్యతో కైలాసానికి చేరాడు. బంధువులుగూడ శివుని చూచిన విశేషమున వారు గూడ శివసాయుజ్యమందినారు. శివుని మీద పరాభక్తి సాకులను వెదుకదు.ధర్మాన్ని ఉల్లంఘింప జేయదు. శివునికి శివభక్తులకు జోహారు.

****